# మాతృత్వం

చుట్టూ కొండలు. అడవులతో నిండిన పచ్చటి కొండలు. వాటి మధ్య అడవిలాంటి మైదానం. నిండా రకరకాల అడవి చెట్లు. మధ్య మధ్య మామిడి, చింత, బూరుగు, వెలగ, ఈత, తాటి, తుమ్మ, వేప, రావి, మర్రి ఇంకా పేర్లు తెలీని రకరకాల చెట్లు. ఆ మధ్యలో చిన్న చిన్న పల్లెలు. ఆ పల్లెల చుట్టూ పంటపొలాలు.

తూర్పు ఆకాశాన గొప్ప ఇంద్రధనస్సు. పడమటి ఆకాశంలో అస్తమయ భానారుణ కిరణాలు కోమలహస్తాలతో ప్రకృతిని స్పృశిస్తున్నాయి.

నరవాసనలేని ఈ అడవిలో మా ప్రవేశంతో ఆ లోటు తీరింది.

సృష్టి సంధ్యావందనం చేస్తున్నట్టు, ప్రణవనాదం ప్రతిధ్వనిస్తున్నట్టు ఎక్కడెక్కడినుండో సాగి సాగి వస్తున్న స్వరమాధుర్యంతో కూజిత గాన స్రవంతి.

ఒక బూరుగు చెట్టుక్రింద ఆగాం.

దొర భుజాన తుపాకీ. చెట్టుక్రింద నేలమీద పరిశీలనగా చూశాడు. చెట్టు క్రిందంతా వెతికి వెతికి చూశాడు.

'ఇక్కడికి రావటం లేదు. ఆ చెట్టు చూద్దాం పదండి' అన్నాడు దొర. దొర వెనక ఒక అనుచరుడు. ఇద్దరూ ముప్పయిఅయిదేళ్లవాళ్లు. వాళ్లల్లో చిన్నవాడిని నేనే. ఇరవైయ్యేళ్లు నా వయసు.

నెమళ్లవేటకి వచ్చాడు దొర. ఈ ఊళ్లో ఉద్యోగానికి వచ్చి ఏడాది అవుతున్నది. ఇక్కడ నెమళ్లవేట మామూలే. కొన్నిసార్లు కొండజాతి సవర్లు పట్టుకున్న నెమళ్లను ఊళ్లోకి తెచ్చి దొరలకి అమ్ముతారు. నన్ను పిలిచి ఆ విందుభోజనాలు పెట్టారు దొరలు. నేను వాళ్ల పిల్లలకు ఉపాధ్యాయుడిని. ఆ రకంగా ఆ పిల్లల ప్రేమ వల్ల నేను

వాళ్ల ఇళ్లల్లో వాళ్లకి అతిథిని. భోజనంవేళకి ఆ ఇంట్లో ఉంటే వాళ్లతో భోజనం చేయవలసిందే. వాళ్ల ప్రేమ అట్టాంటిది.

ఆ ఊళ్లో కొత్తగా హైస్కూల్ పెట్టారు. ఏడెనిమిదిమందిమి ఉపాధ్యాయులం. ఈ కొత్త ఉపాధ్యాయుల పట్ల ఆ ఊళ్లో జనానికి ప్రేమ.

ఇవేళ వాళ్ల నెమలివేట చూడాలన్న ఉత్సాహంతో వచ్చాను. సంజ వెలుగుల్లో పురివిప్పి నాట్యం చేసే నెమళ్లదృశ్యం గురించి ఇక్కడ రైతులు చెప్పుకుంటారు. చివరకు విద్యార్థులు కూడా తమ కళ్లతో తాము నెమళ్లను అడవిలో చూసినట్టు చెప్తూ ఉంటారు.

ఇంకో అర్థగంటలో నెమళ్లు తమతమ నెలవులు చేరుకుంటాయి. ఆ చేరుకునే టప్పుడు అవి ఆడుకుంటూ వస్తాయి. కాని ఈ మధ్య ఈ వేట మూలంగా చాలావరకు నెమళ్లు లోపలి ప్రాంతాలకు పారిపోయాయి. కొద్దిపాటి మాత్రం ఇంకా ఉంటున్నాయి. అవి వచ్చేటప్పుడు భయం భయంగా కొమ్మల సందుల్లోంచి పొంచి పొంచి చూసి వస్తున్నాయంట.

ఇంకో బూరుగు చెట్టు కింద ఆగాం.

'గురూ! యిదిగో' అని నేలమీద పడిన నెమలిరెట్టను ఇంత మట్టితో పాటు తీసి దొరకి చూపించాడు అనుచరుడయిన స్నేహితుడు. 'ఎప్పటిదంటావ్?' అని తుపాకి పట్టుకున్న దొరని ప్రశ్నించాడు.

నెమలివేటలో దిట్ట దొర. ఆ శాస్త్రం మొత్తం అతడు చెప్పగలడు.

'వర్షం వల్ల తడిసిందేమో' అని సంశయాన్ని వెల్లడిస్తుండగా 'రంగుచూస్తే తెలీటంలేదా గురూ?' అని నెమలి ఇక్కడకు ఇప్పుడు వస్తున్నట్టు ధృవపరుస్తున్నాడు దొర స్నేహితుడు.

ఇవాళ ఖచ్చితంగా ఇక్కడికే వస్తుంది... వేట ఫలిస్తుంది అని వాళ్ల ఉద్దేశం.

ఆ చుట్టూరా పొదల్లో... మరికొన్ని ఆధారాలు దొరకవచ్చు. ఒక వెదురు పొద ఉంది. ఆ పొద చూట్టానికి కళ్ల పండుగ్గా ఉంది. కొత్త కొత్త పూలు. కొత్త కొత్త కాయలు. ఆడుకునే సీతాకోకచిలకల్లాంటి రకరకాల కీటకాలు.

మాలో రెండోవ్యక్తికి ఊళ్లో బెల్లం వ్యాపారం ఉంది. ఆ సీజన్‌లో అతడు బాగానే సంపాదించుకుంటాడు. దొర, అతడూ ఇద్దరూ సినిమాలు చూట్టానికి దగ్గర్లో ఉన్న పర్లాకిమిడి పోయి వస్తారు. ఒకరికొకరు తోడు. బహుశా చిన్నప్పటి స్నేహితులేమో. ఆస్తి అంతస్తులలో వాళ్లిద్దరి మధ్య భేదం ఉన్నప్పటికీ వారి స్నేహంలో ఆ భేదం

కన్పించదు.

ఆ ఇద్దరితో నేను ఇవాళ కలియటం చూసిన ఓ కొంటెవాడు నవ్వుకుంటూ 'వేట జూదంబు పానంబు వెలది పొత్తు' అని 'పద్దావా వీళ్ల దారిలో' అన్న ధ్వనితో పద్యం వినిపించాడు. ఆ నాలుగు సుగుణాలు వాళ్లకు ఉన్నాయని నాకు హెచ్చరిక.

'ఇంక సందేహం లేదు' అన్నాడు, నెమలి పింఛం నుండి రాలిన నెమలి ఈకలని తీసి చూపించాడు దొర.

ఎంతో మనోహరంగా ఉందా నెమలి కన్ను. శ్రీ కృష్ణుని తలమీద ఉన్నంత అందంగా. రంగులతో కోమలంగా.

'ఐతే మగది కూడా ఉన్నట్టే'

'సందేహం లేదు'

'ఇంక మీరు వెళ్లండి దూరం'

రెండోవ్యక్తితో పాటు నేను అక్కడి నుండి దూరంగా వెళ్లిపోయాను.

'సరే, ఆ పిట్ట వచ్చేవేళ కదా. కనిపించేట్టు కూచుందాం?' అన్నాను. దగ్గర్లో ఓ చెట్టంత బండ దగ్గర్లో చాటుగా కూర్చోవచ్చు కదా అనిపించింది.

'అబ్బే. వీల్లేదండి. మనల్ని పసికట్టిందనుకోండి ఇంక రాదు.' అని నన్ను తనతో పాటు దూరంగా తీసుకుపోయాడు అతడు.

నెమలికన్ను నా చేతిలో ఉంది.

కళ్లు మూసుకోకుండా చూస్తున్నాను. ఏ దిక్కునుండి నెమళ్లు వస్తాయో చూడాలని.

సూర్యాస్తమయం వెలుగు కూడా తగ్గిపోయింది.

నోరెత్త నివ్వటంలేదు. అంతా సైగల భాష. దాదాపు అరఫర్లాంగ్ దూరంలో సీతాఫలం మొక్కల పొదలో దాక్కుని కూర్చున్నాం.

'అదిగో చూశారా?' అన్నట్టు సైగచేసి వేలుతో చూపించాడు ఆయన.

ఆ వేలు చూపినవేపు ఓ వేప చెట్టంత పెద్ద బండమీద కొమ్మలాగ ఓ నీడ కనిపించింది. ఆ నీడ కదిలింది. పురివిప్పి ముడుచుకుంది. మగ నెమలి అన్న మాట.

'అబ్బో మనల్ని చూసేసింది' అని ఆయన నన్ను తల కిందికి దించుకోమన్నాడు. ఆయనయితే నేలమీద సాగిలపడిపోయాడు. ఇద్దరం ఇంకా వెనక్కి వేరే మొగలి పొదవేపు జరిగాం.

అక్కడకు పదిహేన్నిమిషాల తర్వాత దొర తుపాకీతో నిరాశగా వచ్చేశాడు.

ముగ్గురం కొంతసేపు చీకట్లో నడచి తర్వాత టార్చిలైట్ వెలిగించుకుని తిరిగి వచ్చేశాం.

* * *

ఈ మధ్య ఓ వారం రోజులుపాటు దొర జిల్లా ముఖ్యకేంద్రంలో రాజకీయ కార్యకలాపాల్లో మునిగి వచ్చాడు. నిన్ననే వాళ్లు వేటకు వెళ్తుండగా నేను అనుకోకుండా దార్లో వాళ్లకు ఎదురయ్యాను. ఈ సారి వేట ఫలించింది. అయితే ఆడపిట్ట తప్పిపోయింది.

ఇవేళ ఆడపిట్టని వేటాడటానికి బయల్దేరాము. ఈ దినం ఆడపిట్ట అక్కడ దొరకదు అని నాకు నమ్మకం ఏర్పడిపోయింది.

ఆ బూరుగు చెట్టుకు పాతిక గజాల దూరంలో ఓ చెట్టు దగ్గర మాటు కాసి కూర్చున్నాడు దొర. నెమలి దారికి కొంచెం దూరంలో మేము దాక్కున్నాం.

నిన్న మగనెమలి వేట దృశ్యం గుర్తొస్తున్నది. దొర తుపాకిగుండు తగిలి పడిపోయినా ఎగిరెగిరిపోవాలని ప్రయత్నించిన నెమలి చివరికి రెండో గుండు అవసరం లేకుండానే దొరికిపోయింది. దొర తుపాకిని స్నేహితుడికిచ్చి నెమలి మెడని పట్టుకునే సరికి అది బతికే ఉంది. దాన్ని పెంచుకుంటే బ్రతకదా అని నేను అడిగితే దొర వెటకారంగా నవ్వాడు.

'సవరలకు చెప్తే తెచ్చి పెట్తారు పెంచుకోండి' అన్నాడు దొర.

కుమారస్వామి వాహనం. ఆ కాళ్లల్లో పాము. ఆ దృశ్యం కళ్లల్లో కన్పిస్తూనే ఉంది. పాము నెమలి పోట్లాట వర్ణించి చెప్పిన కథలు. ఆ నెమలి పింఛం. ఆ మొత్తం పింఛం నాకు ఇస్తానన్నాడు దొర. తెచ్చుకోవచ్చు.

రాత్రి విందుభోజనానికి రమ్మన్నారు నన్ను. నేను పోలేదు. ఇదివరకు నెమలిమాంసం తిన్న వాడినే. అయినా మనసు ఇష్ట పడలేదు.

సిద్ధార్థుడు హంస కథ గుర్తొచ్చింది.

రామాయణ మహాకావ్యం రాసిన వాల్మీకికి మహాప్రేరణ క్షతక్రౌంచమే కదా. భవిష్యత్ తరతరాల చరిత్రని ప్రభావితం చేసిన మహా ఘటన అది. మహా కావ్యం అది.

మేమా?

కారుణ్యమే ఎరగని పైశాచిక...

ఇవేళ కూడా ఈ వేటకి వెళ్తున్నానంటే తెలుస్తూనే ఉంది నా రాక్షస స్వభావం...

ఆ ఆడనెమలి దొరకదని నాకు అన్పిస్తున్నది. నిన్ననే మొగ నెమలి చనిపోయింది కదా. మళ్లీ ఆ స్థలానికి వస్తుందా? ఈ వేటగాళ్ల తంత్రం ఏమిటి?

ప్రణయజంట. మగపిట్ట నేల కూలిపోయినప్పుడు ఆ ప్రణయబంధం పక్షుల్లో ఉంటుందా? తన జతగాని కోసం ఆడపిట్ట రోదిస్తుందా? వస్తుందా?

ఏ దుఃఖంతో, వేదనలో షాజహాన్ లక్షలాది శ్రమజీవులతో ఏళ్ల తరబడి కోట్లాది రూపాయల స్మృతి సౌందర్య మణిదీపం తాజ్‌మహల్‌ని నిర్మించాడో... ఏ పొందుకోసం రాజులు రాజ్యాలని తృణప్రాయంగా త్యజించారో... వీరులు ప్రాణాలను లెక్కచేయక సమర్పించుకున్నారో...

దూరాన తుపాకి శబ్దం.

ఆ రెండో వ్యక్తి నన్ను చేత్తో పిలుస్తూ ఆ తుపాకి చప్పుడు దిక్కుగా పరుగు తీశాడు. నేనూ పరుగు తీశాను.

నెమలి నేలమీద కూలిపోయింది. రెక్కలు కొట్టుకుంటున్నది. నిలుచోవాలని ప్రయత్నిస్తున్నది. జీవితం తుది చైతన్యాలేవీ మానుకోలేకుండా పోరాడుతున్నది.

పింఛం లేదు. బోడిగా ఉంది. అయినా అందంగా ఉంది. ముద్దుగా ఉంది.

దొర విజయగర్వంతో వచ్చాడు. రెండోవాడు అదే సంతోషంతో ఉన్నాడు.

నిన్నటి అనుభవం తర్వాత కూడా ఈ హింసను చూట్టానికి ఎందుకు వచ్చానో అంతుచిక్కటం లేదు.

'నిన్నటి చెట్టు మీదే వాలిందిరా. అక్కడికే వస్తుందనుకున్నాను'

ప్రమాదం ఉంటుందని తెలిసి ఈ నెమలి ఎందుకు ఇదే చెట్టుమీదికి వచ్చినట్టు? పాపం అమాయకమైన ఈ పిట్ట ఈ ప్రమాదాన్ని ఊహించలేక పోయిందా?

ఇంత అమాయకమైన నిన్ను చంపేశాం కదా!

రెండో వ్యక్తి పిట్టని మోస్తున్నాడు.

ప్రియుడుతో పాటే చనిపోవాలనుకుందో ఏమో... అతడు లేని తన జీవితం వద్దనుకుందా... ఒకర్నొకరు విడిచి స్వర్గానికన్నా వెళ్లొద్దని బాసలు చేసుకున్నాయా...

ఇంక కదలబోతున్నాం.

ఆ రెండో వ్యక్తికి ఆ చెట్టు సమీపంలోని ముండ్లపొదలో చిన్న చిన్న బంతులంత తెల్లనిగుడ్లు కనిపించాయి.

'ఇవిగో ఇవిగో' అని పిట్టని కింద పెట్టి వెళ్లాడు. ఆరు గుడ్లున్నాయి. ఆ గుడ్లని

పిట్ట ముఖం దగ్గర పెట్టినప్పుడు కొన ప్రాణంతో ఊగిసలాడుతున్న ఆ నెమలి పిట్ట ఆఖరి ప్రయత్నంగా లేచి పడిపోయింది.

ఈ గుడ్ల కోసమే వచ్చిందా ఆ తల్లి నెమలి...

ఆ గుడ్లని తువ్వాలుతో చిన్న మూట కట్టాడు దొర.

* * *

*'స్రవంతి' సాహితీ మాస పత్రిక 64*

*('దేశంలో వన్యప్రాణుల సంరక్షణ-పర్యావరణం - చట్టాలు లేని రోజుల్లో రాసిన కథ. అప్పటికి నెమలి జాతీయ విహంగం కాలేదు.)*